ప్రజాశక్తి

గురువారం 28 నవంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అదానీ డేటా పార్క్‌కు చిక్కులు తప్పవా?

◆ విశాఖలో రెండు సార్లు శంకుస్థాపన

2019లో శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబునాయుడు (ఫైల్)

ప్రజాశక్తి గ్రేటర్ విశాఖ బ్యూరో

విద్యుత్ సరఫరా ఒప్పందాలను పొందడానికి భారత ప్రభుత్వ అధికారులకు 250 బిలియన్ డాలర్ల లంచం ఇచ్చినట్లు న్యూయార్క్‌లోని అమెరికా ప్రాసిక్యూటర్లు ఆరోపించిన నేపథ్యంలో విశాఖపట్నంలోని అదాని గ్రూప్‌నకు చెందిన డేటా పార్క్ ప్రాజెక్టు పనులు ముందుకు ఎలా సాగుతాయన్న ప్రశ్న అందరిలోనూ నెలకొంది. వైసిపి ప్రభుత్వం హయాంలో రూ.15 వేల కోట్ల అంచనా వ్యయంతో అదానీ డేటా సెంటర్ కోసం ఎపిఐఐసి అనుమతులు ఇచ్చింది. అదానీ కొండగా పిలవబడే పనోరమ హిల్స్ వద్ద రెండు కొండలపైన చదును చేశారు.

రెండోసారి చంద్రబాబు హయాంలో ఇక్కడే రూ.21,844 అంచనా వ్యయంతో అనుమతులు మంజూరు చేసింది. తాజాగా అమెరికా సహా అనేక దేశాల్లో అదానీ వ్యవహారం చర్చ జరగడంతో ఈ ప్రాజెక్ట్ ప్రశ్నార్థకంగా మారింది. పార్లమెంటు సమావేశాల సందర్భంగా నిరసనలతో హోరెత్తుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రూ.100 కోట్ల అదానీ సిఎస్ఆర్ విరాళాన్ని తిరస్కరించింది. గౌతమ్ అదానీ నేతృత్వంలోని సంస్థతో కుదుర్చుకున్న అన్ని ఒప్పందాలను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్‌లోని సిపిఎం వామపక్షాలు, కాంగ్రెస్ పట్టుబడుతున్నాయి.

హిడెన్ బర్గ్ ముందే బయట పెట్టినా...

కొన్ని మోసపూరిత ఒవ్పందాలపై హిడెన్ బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో కొంతకాలంగా అంతర్జాతీయంగా తన ప్రతిష్టను దెబ్బతీసిన తరుణంలో తాజా వివాదం గ్రూప్ అవకాశాలను దెబ్బతీసింది. 250 మిలియన్ డాలర్ల లంచం చెల్లింపులో అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీతో పాటు మరో ఏడుగురిని అమెరికా ఫెడరల్ ఏజెన్సీలు తప్పుపట్టాయి. ఇదే ఆరోపణలపై గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు, అదానీ గ్రీన్ ఎనర్జీలో ఉన్నతాధికారి సాగర్ అదానీ, అజూర్ పవర్‌కు చెందిన సిరిల్ సెబాస్టియన్ డొమినిక్ కబానెస్పై జ్యూరీ ట్రయల్స్, భారీ జరిమానాలు విధించాలని కోరుతూ యుఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఇసి) న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

అదానీకి అండ ప్రధాని అని తెలిపోయింది...

అదానీ కుంభకోణానికి తెరదించుతూ, అంతర్జాతీయంగా పలు ప్రాజెక్టులను రద్దు చేయగా... మన ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి సన్నిహితంగా ఉండే అదానీ గ్రూప్ ఈ వార్తలను 'అవాస్తవం, పనికిమాలినవి' అని కొట్టిపారేసింది. విశాఖపట్నంలో అదానీ ప్రాజెక్టుకు రెండుసార్లు శంకుస్థాపన చేయగా, తొలిసారి సార్వత్రిక ఎన్నికల ముందు 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, 2023 మేలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం మధురవాడ గ్రామంలోని కాపులుప్పాడలో 200 మెగావాట్ల డేటా సెంటర్, ఇంటిగ్రేటెడ్ బిజినెస్ పార్కు, హై అండ్ డ్ స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రభుత్వం ఇప్పటికే 130 ఎకరాలను కేటాయించింది. అయితే ఈ ప్రాజెక్టు పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

అన్నీ నీటి మీద రాతలే...

20 ఏళ్లలో

మిగతా 2లో..

ఫార్మాలో విషవాయువు లీక్

◆ ఒకరు మృతి ◆ 8 మంది కార్మికులకు అస్వస్థత
◆ ఇద్దరి పరిస్థితి విషమం ◆ ఆలస్యంగా ఆస్పత్రికి తరలింపు
◆ ప్రమాదంపై సిఎం చంద్రబాబు ఆరా
◆ రూ.కోటి పరిహారం చెల్లించాలి : సిపిఎం

ప్రధాన వార్త మెయిన్‌లో

ప్రజాశక్తి-పరవాడ : అనకాపల్లి జిల్లా పరవాడలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలోని ఠాగూర్ లేబొరేటరీలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందాడు. 8 మంది అస్వస్థతకు గురయ్యారు. అర్ధరాత్రి విషవాయువు లీకై 9 మంది అస్వస్థతకు గురయితే, బుధవారం ఉదయం ఆరు గంటలకు యాజమాన్య ప్రతినిధులు బాధితులను ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ లోపు కంపెనీలో హెల్పర్‌గా పనిచేస్తున్న ఒడిశాకు చెందిన అమిత్ బాగ్ (23) మృతి చెందాడు.

రూ.కోటి పరిహారం ఇవ్వాలి

ఠాగూర్ ఫార్మా కంపెనీలో మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని, అస్వస్థతకు గురైన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని, ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిపిఎం, సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యన్నారాయణ ప్రమాదం స్థలాన్ని సందర్శించారు.

ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న లోకనాథం, గనిశెట్టి సత్యనారాయణ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

▶ వార్త 3లో..

20కిలోల గంజాయి స్వాధీనం

▶ వార్త 3లో..

కైలాసగిరిపై అడ్వెంచర్ స్పోర్ట్స్

▶ వార్త 4లో..

ఉత్కంఠ పోరులో ఛత్తీస్‌గఢ్ విజయం

▶ వార్త 8లో..

భూముల డి-నోటిఫికేషన్‌కు చర్యలు

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విఎంఆర్‌డిఎ భూసేకరణ భూములకు సంబంధించి డి-నోటిఫికేషన్ చర్యలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్లలతో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ అసోసియేషన్, సొసైటీలకు సంబంధించి 22ఎ భూముల డి-నోటిఫికేషన్ పనులు పూర్తి చేయాలని తెలిపారు. పోర్ట్ ట్రస్ట్ భూ సేకరణకు సంబంధించి డి- నోటిఫికేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలని ఆదేశిస్తూ, సక్రమంగా చేయని అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి అధికారులతో సమీక్షించి తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి భవానీశంకర్, విశాఖపట్నం ఆర్‌డిఒ శ్రీలేఖ, భీమిలీ ఆర్‌డిఒ సంగీత్ మహాదూర్, మండల రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : గుత్తేదార్లు, అధికారులు సమష్టి కృషితో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి, ఉత్తమ ఫలితాలు సాధించాలని, రోజుకు 100 నుంచి 150 నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. లే-అవుట్ల వారీగా సమీక్షించిన కలెక్టర్ అక్కడ చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయిలో గుత్తేదార్లతో శతశాతం పని చేయించాలని, నిర్దేశిత లక్ష్యాలకు మేరకు స్టేజ్ కన్వర్షన్ జరగాలని, నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు, లే-అవుట్ ఇన్‌ఛార్జి అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని క్షేత్ర స్థాయి అధికారులకు తగిన సహకారం అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకొని ముందుకెళ్లాలని,మరింత పురోగతి సాధించాలన్నారు.

సమావేశంలో కొంతమంది ఎఈలు, ప్రత్యేక అధికారులు ఆయా లే-అవుట్ల స్థాయిలో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పూర్తి స్థాయి పరిశీలన చేసి నివేదించాలని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ పిడిని ఆదేశించారు. లక్ష్యాలు చేరుకోవటంలో అధికారులు, సిబ్బంది విఫలమైతే ఎఇలకు మెమోలు జారీ చేస్తానని, మూడు తప్పులు చేస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ఆళ్ల శ్రీనివాసు, ఇఇ, డిఇలు, మండల ప్రత్యేక అధికారులు, ఎఇలు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

అదానీ డేటా పార్క్‌కు చిక్కులు తప్పవా?

రూ.70,000 కోట్ల పెట్టుబడితో ఆంధ్రప్రదేశ్‌లో డేటా సెంటర్ క్లౌడ్ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని విస్తరించేందుకు అదానీ గ్రూప్ ముందుకొచ్చింది. ఆ తర్వాత వైసిపి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును కుదించింది. పైన తెలిపినట్లు రూ. 70వేల కోట్లనుంచి రూ.15 వేల కోట్లకు ఈ ప్రాజెక్టు గ్రౌండింగ్‌కు సంబంధించి అడ్డంకులను తొలగించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టిన నేటి తరుణంలో తాజా లంచాల కుంభకోణం ప్రాజెక్టు పనుల ప్రారంభంపై నీడలు ఆలముకున్నాయి

ఇఎఎస్ శర్మ మండిపాటు...

లంచం కుంభకోణం బహిర్గతం కావడంపై ప్రముఖ సామాజిక కార్యకర్త, ఐఎఎస్ మాజీ అధికారి ఇఎఎస్ శర్మ మీడియాతో మాట్లాడుతూ అదానీ ఆంధ్రప్రదేశ్‌కు కొత్తేమీ కాదు. 2014-19లో టిడిపి నేతృత్వంలోని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లాలోని భావనపాడు పోర్టును వెండి పళ్లెంలో అందించింది. అదానీ మాత్రమే కాదు టిడిపి, వైసిపిలు కూడా అదానీ, ఇతర సంస్థలకు విలువైన భూములు, ఇతర మౌలిక సదుపాయాలను కట్టబెట్టాయి. ముందుగా పంపిన టిడిపి ప్రభుత్వం ఆ వైఖరి నుంచి వెనక్కి తగ్గ లేదన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తూ, సంక్షేమ పథకాలు అందిస్తూ నగరాన్ని అభివృద్ధి పరచడంలో కీలక బాధ్యత జివిఎంసి అధికారులదేనని కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. జివిఎంసి 8వ జోన్ అభివృద్ధి, ప్రజల సమస్యలపై సింహాచలం గోశాల సమీపంలోని 'కె' కన్వెన్షన్ సెంటర్‌లో 8వ జోన్‌కు సంబంధించి జోనల్ స్థాయి అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా జోనల్ స్థాయిలో గల అన్ని విభాగాల్లో ఉన్న సమస్యలపై, అభివృద్ధి పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా 8వ జోనల్ కమిషనర్ హేమావతి, సంబంధిత విభాగాధిపతులు కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ ప్రతి జోన్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, నూతన పనుల ప్రతిపాదనలతో పాటు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో జోనల్ స్థాయి అధికారులు కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. 8వ జోన్ పరిధిలో 10 వార్డులలో 3,23,000 మంది ప్రజలు 68.20 స్క్వేర్ కిలోమీటర్ల గల ప్రాంతంలో నివసిస్తున్నారని, అందులో రూ. 80,117 నివాసాలు ఉన్నాయని, వారికి నిత్యం పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జోన్ పరిధిలో గ్రావెల్ రోడ్లు ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తూ అవసరం మేరకు తారు రోడ్లను వేసి అభివృద్ధి పరచాలని, ఇప్పటికే 775 పాట్ హోల్స్ పూర్తి చేయగా మిగిలినవి వెంటనే పూర్తి చేయాలని, చేపట్టాలన్నారు.

కేంద్ర మంత్రితో అక్షయ ఇన్నోటెక్ ప్రతినిధుల భేటి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో అక్షయ ఇన్నోటెక్ ప్రతినిధులు విశాఖలోని ప్రభుత్వ అతిథిగృహంలో భేటి అయ్యారు. ఈ సందర్భంగా అక్షయ ఇన్నోటెక్ నిర్వహిస్తున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి తమ సంస్థ అందిస్తున్న అత్యాధునిక సాంకేతిక పద్ధతులను ఆయనతో చర్చించారు. ఈ విధానంపై మంత్రి ఆసక్తిని కనబరిచారని, ఈ పద్ధతులను గుంటూరు పార్లమెంటు నియోజకవర్గంలో ప్రాథమిక స్థాయిలో అమలు చేసేందుకు ఆయన ఆసక్తి కనబరిచారని అక్షయ ఇన్నోటెక్ మేనేజింగ్ పార్టనర్ డాక్టర్ రేణు శరత్ బాబు తెలిపారు. తమ సంస్థ సాధారణంగా ఇళ్లలో ఉత్పత్తయ్యే ఘన వ్యర్థాలను వేరు చేసి వీటిలో ఆహార వ్యర్థాలు, కూరగాయలు పండ్ల తొక్కలు, మిగిలిపోయిన ఆహారాలు మొదలైన వాటితో సహా అందులో ఉన్న 30-40 శాతం సేంద్రీయ పదార్థం ద్వారా వ్యర్థాలను ఎరువుగా మార్చుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఎస్.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అక్షయ ఇన్నోటెక్ ప్రతినిధులు

టిడిపిలో చేరిన వైసిపి కార్పొరేటర్లు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : వైసిపికి చెందిన జివిఎంసి 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, ఆమె భర్త అప్పారి గిరిబాబు, 23వ వార్డు వైసిపి కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, ఆమె భర్త గుడ్ల సత్యారెడ్డి బుధవారం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జివిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీను ఆధ్వర్యాన ఎంవిపిలోని వెలగపూడి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరితోపాటు 300 మంది కార్యకర్తలు కూడా టిడిపిలో చేరారు.

నర్సీపట్నం పురపాలక సంఘం - నర్సీపట్నం

ఆర్.ఓ.సి.నెం.1246/2020/ఎఫ్1 **నోటీఫికేషన్** తేదీ.26-11-2024

దేశవ్యాప్త స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో మన నర్సీపట్నం పురపాలక సంఘం స్వచ్ సుర్వేక్షణ-2024 పోటీలో పాల్గోని జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంక్ సాధన కోసం పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా మన పట్టణాన్ని బహిరంగ మల మూత్ర విసర్జనా రహిత పట్టణం (ఓడిఎఫ్) ప్లస్ కేటగిరీ పట్టణంగా గుర్తింపు సాధించుటకు మరియు ప్రజలు స్వచ్చందముగా తడి మరియు పొడి చెత్తను వేరు చేసి నివాసాల వద్దనే పురపాలక సంఘానికి అందచేసి ఘన వ్యర్ధ పదార్థాల నిర్వహణ రూల్స్ అమలు పరచుటకు సహకరించి, తద్వారా, పట్టణ పరిశుభ్రతకు ప్రజలు యావన్మది సహకరించవలసినదిగా కోరుతూ ఈ పత్రిక ప్రకటన జారీ చేయడమైనది.

సం/- **కమీషనరు**, నర్సీపట్నం పురపాలక సంఘం

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు వేతన సవరణ చేపట్టాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల వేతన సవరణ వెంటనే చేపట్టాలని, పెన్షన్ సవరణ సమస్యను పరిష్కరించాలని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ కన్వీనర్ పిఇసిహెచ్‌వి.సాగర్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా కో-ఆర్డినేషన్ కమిటీ పిలుపుమేరకు బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, ఎఐబిడిపిఎ, బిసిడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యాన బుధవారం డాబాగార్డెన్స్‌లోని పిజిఎంటిడి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిఎస్ఎన్ఎల్ 4జి, 5జి సేవలు త్వరగా ప్రారంభించాలన్నారు. బిఎస్ఎన్ఎల్‌లో రెండవసారి విఆర్ఎస్ అమలు చేసే విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కాంట్రాక్ట్ కార్మికులకు స్కిల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. డిమాండ్‌కు తగ్గట్టు బిఎస్ఎన్ఎల్ సిమ్‌లు వెంటనే సరఫరా చేయాలని, ఉద్యోగుల స్టాగ్‌నేషన్ సమస్యలు పరిష్కరించాలని, ఎఎటి, టిటి, జెఇ వేకెన్సీలు భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.రామాంజనేయులు, పి.లచ్చిరాజు, ఎఎ అశ్రఫ్, ఆర్.సత్యనారాయణ, ఉమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం హార్బర్‌లోని ఫిషరీస్ జెడి కార్యాలయం ఎదుట విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం ఫిషరీస్ జెడికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు జెవి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, డ్రైవర్లు, కళాసీలకు చెందిన వలలు, ఇతర వేట సామాగ్రిని భద్రపరుచుకొనుటకు వసతి కల్పించాలని, విశ్రాంతి తీసుకోవడానికి, సమావేశాలు ఏర్పాటుకు భవనాన్ని కేటాయించాలని, మత్స్యకార భరోసా 2024 నిధులను సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యాంత్రిక బోట్లు వినియోగించే మత్స్యకారులకు 50 శాతం రాయితీతో డీజిల్ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.చంద్రశేఖర్, కూడా వజ్రం, జిఎస్‌జె.అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అంగన్‌వాడీలకు అవగాహన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : బాల్య వివాహాలు జరిగేటప్పుడు అంగన్వాడీలకు అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యాన న్యాయసేవాసదన్‌లో బాల్య వివాహ విముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడుతూ, మగ వారికి 21 సంవత్సరాలు, ఆడవారికి 18 సంవత్సరాలు నిండిన తరువాత వివాహం చెయ్యాలని చెప్పారు. బాల్య వివాహ నిషేధ చట్టం- 2016, వరకట్న నిషేధ చట్టం, ఎన్ ఎఎల్ఎస్ఎ బాలల స్నేహ పూర్వక పథకం 2015, పోస్కో చట్టం, బాలల సంరక్షణ, రక్షణ చట్టం 2015 తదితర అంశాలు గురించి విపులంగా వివరించారు. 498-ఎ ఐపిసి గృహ హింస చట్టాలు ఆవశ్యకత గురించి వివరించారు. బాల్య వివాహాల జరిగేటప్పుడు అంగన్వాడీ సిబ్బంది తీసుకోవాలసిన జాగ్రత్తలు నియమ, నిబంధనలు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి జి.జయదేవి, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్‌కె బేగం, సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ఇమ్యూనిటీ ఆఫీసర్ డాక్టర్ ఎస్.జీవన రాణి తదితరులు పాల్గొన్నారు. సదస్సులో పాల్గొన్న వారందరితో బాల్య వివాహలకు సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా న్యాయస్థానం నుంచి ర్యాలీ నిర్వహించారు.

సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి వెంకటశేషమ్మ

భవన నియమావళి సవరణలపై ఐఐఎ ప్రత్యేక సమావేశం

సమావేశంలో పాల్గొన్న ఐఐఎ సభ్యులు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఇటీవల మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి నారాయణ ప్రకటించిన భవన నియమావళి సవరణపై ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ (ఐఐఎ) ఆధ్వర్యాన బుధవారం ఉదయం సిరిపురంలోని మంత్రిస్ హోటల్లో అసోసియేషన్ ఛైర్మన్ రాజేష్ నాగుల అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా మంత్రి నారాయణ ప్రకటించిన భవన నియమావళుల (బై-లాస్) సవరణలపై చర్చించారు. సమావేశంలో భాగంగా ఆర్కిటెక్టులు తమను బాధ్యత గల కన్సల్టెంట్లుగా నిరూపించుకోవడం పట్ల కట్టుబడి ఉన్నామని, ఆర్కిటెక్ట్స్ యాక్ట్-1972 ద్వారా స్థాపితమైన కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో నమోదైన ప్రొఫెషనల్‌లు కావడంతో ఈ బాధ్యతలను సంతోషంగా స్వీకరిస్తామని తెలిపారు. ప్రభుత్వ ప్రకటన ప్రకారం ఆర్కిటెక్టులు తగిన విధంగా పనిచేయాలని చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ లక్ష్యాలను సాధించడంలో తాము తమ బాధ్యతలను నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్కిటెక్టులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గౌరవ కార్యదర్శి ఆర్కిటెక్ట్ రామ్జీ ఎ. వూటాడ, కమిటీ సభ్యులు, పలువురు ఆర్కిటెక్టులు హాజరయ్యారు.

'రవికిరణ్‌పై 20 తప్పుడు కేసులు'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైసిపి సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఇంటూరి రవికిరణ్‌పై 20 వరకు తప్పుడు కేసులు బనాయించి, వివిధ స్టేషన్లకు ఆయనను తిప్పుతున్నారని ఆయన భార్య, సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఇంటూరి సుజన ఆరోపించారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ, విశాఖపట్నం సెంట్రల్ జైలులో తన భర్త ఉన్నట్లు తెలిసి ములాకత్‌లో కలిసేందుకు వెళ్లానని, అయితే ఆయనను అక్కడ నుంచి పోలీసులు తీసుకువెళ్లి మరో తప్పుడు కేసులో ఇరికించారని ఆరోపించారు. అక్కడితో ఆగలేదని, రాష్ట్రంలో పలుచోట్ల ఆయనపై కేసులు నమోదు చేసి, ఎక్కడెక్కడో తిప్పుతున్నారని ఆరోపించారు. ఎందుకు అరెస్టులు చేస్తున్నారని అడిగితే పోలీసుల నుంచి స్పష్టమైన సమాధానం రావడం లేదన్నారు. సోషల్ మీడియాలో ఏ పోస్టులు పెట్టారో స్పష్టం చేయాలన్నారు. దువ్వాడ సిఐ మల్లేష్, రాజమండ్రి సిఐ బాజిలాల్ తన భర్తను తీవ్ర హింసలకు గురి చేశారని, తన పట్ల కూడా వారు దురుసుగా మాట్లాడారని ఆరోపించారు. 55 వార్డు కార్పొరేటర్ కెవిఎన్ శశి కళ మాట్లాడుతూ, వైసిపి సోషల్ మీడియా యాక్టివిస్ట్ రవి కిరణ్ కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులతో వేధిస్తోందన్నారు. మీడియా సమావేశంలో వైసిపి మహిళా కార్పొరేటర్లు అక్కరమాని రోహిణి, స్వాతి దాసు, నక్కెళ్ళ లక్ష్మి, శశికళ పాల్గొన్నారు.

అతిసార బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలోని జివిఎంసి 37వ వార్డు పరిధి జబ్బార్ తోటలో అతిసార వ్యాధితో బాధపడుతున్న వారిని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. అతి సార వ్యాధి ప్రబలడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో శానిటేషన్ సక్రమంగా జరిగేలా చూడాలని, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, పరిశుద్ధమైన నీటి ట్యాంకులను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని, సమస్య పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. బ్లీచింగ్, శానిటేషన్ క్రమం తప్పకుండా జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎహెచ్ఒ రాజు, వైద్యాధికారులు,శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న వంశీకృష్ణ

టెన్నిస్ టోర్నమెంట్‌కు ఎఎంసి విద్యార్థినులు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : వచ్చే నెల 7 నుంచి 10వ తేదీ వరకు కర్ణాటక మణిపాల్‌లోని మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌లో జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టెన్నిస్ (మహిళలు) టోర్నమెంట్‌కు ఆంధ్ర మెడికల్ కాలేజీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఆర్.హేమ హర్షిణి, ఆర్ దీపిక ఎంపికయ్యారు.

తుపాన్‌పై రైతులకు అప్రమత్తత

తాటితూరులో రైతులకు సూచనలు చేస్తున్న ఎడిఎ, ఎఒ

ప్రజాశక్తి -భీమునిపట్నం : తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేసే చర్యల్లో భాగంగా వరి కోత పూర్తయిన మజ్జివలస, తాటితూరు గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్, ఎఒ బి.శివ కోమలి, సిబ్బంది పర్యటించారు. పైర్ల రక్షణపై రైతులకు పలు సూచనలు చేశారు. కోసిన వరిపైర్లను కుప్పలుగా పెట్టుకోవాలని, నూర్పు అయిన ధాన్యాన్ని నిల్వ చేసుకునే అవకాశం లేని వారు దగ్గర్లో వున్న రైస్ మిల్లులకు అందజేయాలని సూచించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది సహకారం, సలహాలు తీసుకోవాలన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు రాజేంద్రనగర్ కాలనీలో రూ.25లక్షల జివిఎంసి నిధులతో పలు అభివృద్ధి పనులకు స్థానిక టిడిపి కార్పొరేటర్ సారిపల్లి గోవింద ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన ఉత్తర నియోజకవర్గ ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్, జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఇఇ గంగాధర్, డిఇఇ శ్యామల, ఎఇఇ దీపిక, కూటమి నేతలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్ల రిజిస్ట్రేషన్‌కు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్ మంజుల తెలిపారు. ఎపి పిజి సెట్ లో అర్హత పొందని వారు, ఎపి పిజి సెట్‌కు హాజరు కాలేని వారు కూడా దరఖాస్తు చేసుకునేందుకు అర్హులేనని తెలిపారు.

స్కిల్ ఎంప్లాయిబిలిటీ కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటిలో ఐసిటి అకాడమీ ఆధ్వర్యంలో ఫినిషింగ్ స్కూల్ ఫర్ ఎంప్లాయిబిలిటీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. విద్యార్థులకు విద్యతోపాటు ఉద్యోగ నైపుణ్యతపై రోజూ రెండు గంటలు చొప్పున వంద గంటలపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఎంప్లాయిమెంట్ మేనేజింగ్ సభ్యులుఎస్.కృష్ణంరాజు, చీఫ్ మేనేజింగ్ ఆఫీసర్ డాక్టర్ సుబ్బరాజు పాల్గొని స్కిల్ఎంప్లాయిబిలిటీ కోర్సులు కూడా పూర్తి చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శంభుప్రసాద్, ఐఐసి కోఆర్డినేటర్ డాక్టర్ పి.నవీన్ పాల్గొన్నారు.

రైతు, కూలీల మధ్య సమన్వయం ఉండాలి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : రైతులు, రైతు కూలీల మధ్య సమన్వయం అవసరమని ఎయు పూర్వ విసిఆచార్య జి.నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఎయు సైకాలజీ విభాగంలో సోషియో ఎకనామిక్ ఎంపవర్మెంట్ ఆఫ్ ల్యాండ్లెస్ అగ్రికల్చరల్ లేబరర్స్ సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సును ఏయూ సైకాలజీ విభాగం, ఆగ్రో ఎకనామిక్స్ రీసెర్చ్ సెంటర్, సిఫా ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ సంతోషమనేది బాహ్య పరిసరాలతో గణించేది కాదని, ఇది పూర్తిగా మనసుకు సంబంధించిందన్నారు. రైతుకూలీల మానసిక సన్నద్ధతను, స్థైర్యాన్ని పెంచే విధంగా కృషి చేయాలని సూచించారు. సదస్సు అధ్యక్షులు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవిఆర్ రాజు మాట్లాడుతూ రైతులు, రైతు కూలీలలో ఆర్థిక, మానసిక సమస్యలుపెరిగిపోతున్నాయన్నారు. ప్రకృతి సమస్యలు, ధరల్లో స్థిరీకరణ వీరికి ఇబ్బందికరంగా ఉంటున్నాయని, పర్యవసానంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. దీని నియంత్రణకు వారిలో ధైర్యం నింపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆగ్రో ఎకనామిక్స్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ లిల్లీ గ్రేస్ సామాజిక సమరత ఆల్ ఇండియా కన్వీనర్ శ్యాం ప్రసాద్, విశ్రాంత ఆచార్యులు సి.సాంబమూర్తి సిఫ డైరెక్టర్ డాక్టర్ శశి ప్రభ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

● మృతులు పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ వాసులు

మృతులు పవన్‌కుమార్, రూపేష్



ప్రమాదానికి గురైన బైక్

ప్రజాశక్తి- ఉక్కునగరం :ఆర్‌టిసి బస్సు ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం పాలైన ఘటన బుధవారం సాయంత్రం ఆరున్నర గంటలకు చోటుచేసుకుంది. స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు కూర్మన్న పాలెం ప్రధాన రహదారిలోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ బస్‌స్టాఫ్ వద్ద జరిగిన ఈ ప్రమాదంలోపార్వతీపురం మన్యం జిల్లా, పాలకొండకు చెందిన పవన్ కుమార్ (30), రూపేష్ (21) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. స్టీల్ ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దోసూరు నుంచి గాజువాక వస్తున్న ఎపి 31 జడ్ 0073 అర్‌టిసి బస్సు అదే రూట్‌లో ఎపి 40 సిఎఫ్ 6200 నెంబర్ గల బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు రొడ్డుమలుపు తీసుకుంటుండగా ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు . స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాలను పోస్టమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు

వ్యర్థాల నిర్వహణలో భాగస్వాములు కావాలి

● గీతంలో స్కూల్ చిల్డ్రన్ కాంగ్రెస్‌లో జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్

విద్యార్థుల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న అతిథులు

ప్రజాశక్తి -మధురవాడ : వ్యర్థాల నిర్వహణలో బాలలు భాగస్వాములై పర్యావరణ పరిరక్షకులుగా నిలవాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ అభిలషించారు.గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎయిర్ అండ్ వాటర్ సంస్థ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వ్యర్థాల నిర్వహణ, సర్క్యులర్ ఎకానమిపై 14వ అంతర్జాతీయ సదస్సులో భాగంగా బుధవారం స్కూల్ చిల్డ్రన్ కాంగ్రెస్‌ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్లాస్టిక్ భూతం పర్యావరణానికి పెనుసవాల్‌గా మారిందన్నారు. విశాఖ నగరంలో ప్రతిరోజూ 24 లక్షల ఇళ్ల నుంచి 1200 టన్నుల వ్యర్థాలను సేకరిస్తున్నామన్నారు. ఒక టన్ను వ్యర్థాల శుద్ధికి రూ.2,400 ఖర్చవుతోందన్నారు. దీన్ని తగ్గించాలంటే ప్రజల సహకారం అవసరమని, బాలలు ముందుకొచ్చి దీనిపై అవగాహన కల్పించాలన్నారు. నగరంలో వాయు కాలుష్యం ప్రమాదకరస్థాయికి చేరుకుంటోందన్నారు. మురుగునీటి వ్యర్థాలను ప్రస్తుతం పాక్షికంగానే శుద్ధి చేయగలుగుతున్నామని,వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి వ్యర్థాల నుంచి పూర్తిస్థాయి విద్యుదుత్పాదన, శుద్ధి చేసిన మురుగు నీటిని సముద్రంలోనికి వదలడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె ఘోష్ మాట్లాడుతూ దేశంలోని 152 పాఠశాలలో రెండు లక్షల మంది బాలలను పర్యావరణ ఉద్యమంలో భాగస్వామ్యం చేశామన్నారు. సర్క్యులర్ ఎకానమీపై పాఠశాల అధ్యాపకులకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గీతంవర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ భావితరాలకు సురక్షిత సమాజానికి అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణే ప్రణాళికలు అవసరమన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొపెసర్ రాజా ఫణి పప్పు, నార్వే శాస్త్రవేత్త డాక్టర్ క్రిస్టియన్ జె. ఎంగెల్‌సన్, సదస్సు కన్వీనర్లు ప్రొఫెసర్ సాయి సుధాకర్, డాక్టర్ సౌదామినిపాల్గొన్నారు. స్కూల్ చిల్డ్రన్ కాంగ్రెస్ భాగంగా వ్యర్థాల నుంచి వ్యర్థాల నుంచి విద్యుదుత్పాదన, సౌరశక్తి వినియోగం, నీటి సంరక్షణ తదితర అంశాలపై విద్యార్థులు రూపొందించిన నమూనా ఉత్పత్తులు విశేషంగా అకట్టుకున్నాయి.

75 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ కల్యాణి

ప్రజాశక్తి -తగరపువలస: చిప్పాడ దివీస్ సంస్థ సౌజన్యంతో మండలంలోని పెద నాగమయ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో చిన నాగమయ్యపాలెం ఎంపి యుపి, పాతపాలెం ఎంపిపి పాఠశాలలకు చెందిన 75 మంది విద్యార్థులకు బుధవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. భీమిలి సిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కల్యాణి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్యసూచనలు చేశారు. కార్యక్రమంలో సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్‌కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, నరసింహ, వైద్యసిబ్బంది, పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

కొనసాగిన విశాఖ డెయిరీ కార్మికుల దీక్షలు

డెయిరీ వద్ద సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్ రమణ డిమాండ్ చేశారు. డెయిరీ వద్ద కార్మిక యూనియన్ చేపడుతున్న నిరవధిర రిలే దీక్షలు బుధవారం ఏడోరోజుకు చేరుకున్నాయి. డెయిరీ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రశ్నించే కార్మికులను బదిలీలు, తొలగింపులు వంటి వేధింపులకు పాల్పడుతున్న యాజమాన్యవైఖరి మారాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వియ్యపు ఉపమాక (53) అనే వ్యక్తి మతి చెందాడు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఈడి వర్క్స్ బిల్డింగ్‌లో పనిచేస్తున్న ఉపమాక, బుధవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు వెళుతుండగా అటువైపుగా వస్తున్న స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారి కారు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. నగరంలో కిమ్స్ఐకాన్ ఆసుపత్రికి తరలించి, వైద్యసేవలు అందిస్తుండగా, ఆరోగ్యం విషమించి, మధ్యాహ్నం మృతి చెందాడు. వడ్లపూడి కణితి కాలనీలో నివాసముంటున్న ఉపమాక స్టీల్‌ప్లాంట్‌లో వెంకన్న అనే కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ బాధితుడికి రూ.11లక్షల నష్టపరిహారం ఇతర ప్రయోజనాలను మృతుడి కుటుంబానికి అందజేస్తామని తెలిపారు.

20కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురు నిందితులు అరెస్ట్

వవరాలు వెల్లడిస్తున్న ఎసిపి నరసింహమూర్తి

ప్రజాశక్తి- గోపాలపట్నం : ఉమ్మడి విశాఖ ఏజెన్సీ నుంచి మైదానానికి తరలిస్తున్న 20కిలోల గంజాయిని గోపాలపట్నం పోలీసులు చాకచక్యంగా పట్టుకుని, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. దీనిపై ఎసిపి అన్నెపు నరసింహమూర్తి బుధవారం విలేకర్లకు వివరాలను వెల్లడించారు. గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు చేపడుతున్న చర్యల్లో భాగంగా పక్కా నిఘాతో తనిఖీలు చేస్తున్న పోలీసులకు ఉత్తర సింహాచలం రైల్వే క్వార్టర్స్ వద్ద 20కిలోల గంజాయిని పట్టుకున్నారన్నారు.షూట్‌కేసులో గంజాయి ప్యాకెట్లను వేసి, గంజాయిని ఏజెన్సీ నుంచి కేరళకు గుట్టుగా తరలిస్తున్నట్లు గుర్తించారు. కేరళకు చెందిన శ్రీజిత్తు, పప్పాచన్ ఇద్దరు నిందితులతోపాటు ఏజెన్సీకి చెందిన అలజింగి ఆదర్శ్ అనే మరో నిందితుడిని అరెస్ట్ చేశారన్నారు. గోపాలపట్నం సిఐ, ఎస్ఐలు ఉన్నారు.

నలుగురు జూదరులపై కేసు నమోదు

ప్రజాశక్తి -పద్మనాభం.: మండలంలోని బుడ్డువలస అగ్రహారం పంచాయతీ లింగన్నపేట గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు అదే గ్రామంలో చెరువు వద్ద బుధవారం మధ్యాహ్నం పేకాడుతుండగా పద్మనాభం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం నిందితులను పేకాడుతుండగా పట్టుకుని, వారి నుంచి పేక ముక్కలతోపాటు రూ.7,240 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఇళ్ల స్థలాల హామీ నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి -మధురవాడ : పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలను ఇస్తామన్న కూటమి ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు కోరారు.బుధవారం జివిఎంసి ఏడో వార్డు చంద్రపాలెం పేదలంతా సిపిఐ ఆధ్వర్యంలో 59వ సచివాలయానికి వెళ్లి, నిర్వహణ కార్యదర్శి ఎల్.లత, సంక్షేమ కార్యదర్శి భాస్కరరావులకు వ్యక్తిగత దరఖాస్తులను అందజేశారు.

గత వైసిపి ప్రభుత్వం గ్రామాలకు దూరంగా 79కిలోమీటర్లు దూరంలో ఒక సెంటు ఇళ్లస్థలాన్ని ఇచ్చిందని, దీంతో అనేకమంది లబ్ధిదారులు అక్కడకు వెళ్లలేదన్నారు. అదే తప్పిదాన్ని చేయకుండా అందుబాటులో ఇంటిస్థలాలను కేటాయించడంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు సాయం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యురాలు ఎం డి బేగం, ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, ఎంఎస్ పాత్రుడు పాల్గొన్నారు.

విమ్స్ ఉద్యోగుల దాతృత్వం

సహచర ఉద్యోగి కుమారుడి వైద్యానికి ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందజేస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

ప్రజాశక్తి - అరిలోవ : విమ్స్ ఉద్యోగులు దాతృత్వం చాటుకున్నారు. అంతు చిక్కని అరుదైన వ్యాధితో బాధపడుతున్న సహచర ఉద్యోగి కుమారుడి వైద్యానికి ఉద్యోగులంతా ముందుకు వచ్చారు. తలోచేయి వేసి, రూ.1.30లక్షల సమకూర్చి విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు ద్వారా బాధిత ఉద్యోగికి అందజేశారు.

విమ్స్‌లో ఎంఎన్ఒగా పనిచేస్తున్న బాలు అనే ఉద్యోగి కుమారుడికి అరుదైన వ్యాధి సోకింది. దేశంలోని అనేక ఆసుపత్రుల్లో చూపించినా ఫలితం లేకపోయింది. ఇప్పటికే రూ.లక్షల్లో ఖర్చు కావడంతో ఆర్థికంగా చితికిపోయాడు. ప్రస్తుతం వెల్లూరులోని సిఎంసి వైద్యశాలకు తీసుకెళ్లేందుకు సిద్ధపడుతున్న తరుణంతో సహచర ఉద్యోగులంతా తమవంతు సాయంగా రూ.1.30లక్షలను సమకూర్చి బాలుకు అందజేశారు. కష్టాల్లో ఉన్న ఉద్యోగి కుటుంబానికి అండగా నిలిచిన విమ్స్ ఉద్యోగుల చొరవను డైరెక్టర్ డాక్టర్ రాంబాబు అభినందించారు. బాలుని వైద్యానికి సాయం చేయాలనుకునే దాతలు 93986 09381 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

విజేతలకు బహుమతులిస్తున్న ప్రొఫెసర్ విజయమోహన్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రాయూనివర్సిటీ అంతర్ డిగ్రీ కళాశాలల వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల పరిధిలో 35 కళాశాలల నుంచి 20పురుషులు, 15మహిళాజట్లు పోటీల్లో పాల్గొన్నాయి.

మహిళల విభాగంలో విశాఖ మహిళా కళాశాల జట్టు విజేతగా నిలవగా రన్నరప్‌గా ఎయు ఆర్ట్స్ అండ్ కామర్స్ జట్టు, తృతీయ స్థానంలో అనకాపల్లి ఎఎంఎఎల్ కాలేజీ జట్లు నిలిచాయి.

పురుషుల విభాగంలో ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల జట్టు విజేతగా నిలవగా ద్వితీయ, తృతీయస్థానాల్లో ఎలమంచిలి, అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు నిలిచాయి. విజేతలయు ఎయు డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎన్ విజయమోహన్, ప్రిన్సిపాల్ ఆర్ మంజుల, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ విష్ణుమూర్తి, పూర్వ విద్యార్థి బి శ్రీనివాసరెడ్డి బహుమతులు అందజేశారు.

ఆధునికీకరణ పనుల పరిశీలన

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 65వ వార్డు వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియం ఆధునికీకరణ పనులను జివిఎంసి చీఫ్ ఇంజినీర్ శివప్రసాద్ రాజు, కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, పల్లా శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు కొన్నాళ్లుగా అలంకారప్రాయంగా ఉన్న ఇండోర్ స్టేడియం వల్ల క్రీడాకారుల అసౌకర్యాన్ని గుర్తించిన కార్పొరేటర్ నరసింహపాత్రుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఇండోర్ స్టేడియాన్ని ఆధునికీకరించాలని కోరారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, పల్లా శ్రీనివాసరావు చొరవతో నిధులు మంజూరు కాగా, పనులు కూడా ప్రారంభమయ్యాయి.

ఆయా పనులను పరిశీలించిన సిఇ, తగు సూచనలు చేశారు. స్టేడియంలోకి పావురాలు రాకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ, స్టేడియంతో పాటు ఈతకొలను త్వరలో అందుబాటులోకి రానున్నాయన్నారు. కార్యక్రమంలో ఇఇ ఎంఆర్ఎస్. అప్పారావు, ఎఇఇ శివ, కాంట్రాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

వాలంటీర్లకిచ్చిన హామీలను నెరవేర్చాలి

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న వాలంటీర్లు

ప్రజాశక్తి- పెందుర్తి : గ్రామ, వార్డు వాలంటీర్లకు కూటమి నేతలు ఇచ్చిన హామీని నెరవేర్చాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో పెందుర్తి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ, వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, బకాయి వేతనాలను చెల్లించాలని, రూ.10 వేల వేతన హామీని నెరవేర్చాలని, జాబ్ చార్ట్ ప్రకటించాలని కోరారు. బలవంతంగా రాజీనామా చేయించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాలంటీర్లలో ఉన్నత విద్యార్హతలున్న వారు ఎంతో మంది ఉన్నారని, వారిని తొలగించడం వల్ల నిరుద్యోగ సమస్య సృష్టించిన వారౌతారన్నారు. గత ప్రభుత్వం వారికి కనీస వేతనాలు, పనిగంటలు లేకుండా అవార్డులు, ప్రశంసలతో ముంచేసిందని మండిపడ్డారు. పరిమితం చేసిందని విమర్శించారు. రాజకీయ ఒత్తిళ్లతో అన్యాయానికి గురైన వాలంటీర్లకు న్యాయం చేసి, వారికి ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని కోరారు. ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, జోన్ నాయకులు కె.అప్పలనాయుడు, బి.రమణి, ప్రభుదేవా మహేష్ రాజు, వాలంటీర్స్ సంఘం నాయకులు రూప, దేవి, సావిత్రి, రత్నకుమారి, ప్రసాద్, రాజశేఖర్, సంతోష్, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ దళపతి జన్మదిన వేడుక

నీటి ఏనుగు జన్మదిన వేడుకల్లో దళపతికి ఆహారమిస్తున్న సందర్శకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో సిపిఒ కళాశాల సౌజన్యంతో నీటి ఏనుగు జూనియర్ దళపతి ఏడవ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సందర్శకులు, విద్యార్థులు కేరింతల మధ్య జూ క్యూరేటర్ జి.మంగమ్మ పాల్గొని జూనియర్ దళపతి పుట్టిన రోజు కేక్‌ను కట్ చేసారు. ఈ సందర్భంగా సిపిఇ కళాశాల జూనియర్ దళపతిని ఒక నెల పాటు దత్తత తీసుకున్నారు. వన్యప్రాణుల సంరక్షణకు విద్యార్థులలో అవగాహన పెంపొందించడంలో సిపిఇ కళాశాల చేపడుతున్న కార్యక్రమాలను జూ క్యూరేటర్ జి.మంగమ్మ ప్రశంసించారు. జూనియర్ దళపతి కోసం ప్రత్యేకంగా తయారు చేసిన ఫీడ్‌ను తినిపించారు. కార్యక్రమంలో సిపిఇ కళాశాల సిఇఒ బి.ఆదినారాయణ, ప్రిన్సిపాల్ శ్యామల బలివాద, అసిస్టెంట్ క్యూరేటర్స్ బి.గోపి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భారతి, వెటర్నరీ బృందం పాల్గొంది.

రిపబ్లిక్ డే పరేడ్ ముందస్తు శిక్షణలో దివ్యశ్రీ సత్తా

దివ్యశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి-ములగాడ : జాతీయస్థాయిలో రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనేందుకు ఎంపికై, ముందస్తు శిక్షణలో సత్తా చాటిన స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ పి.దివ్యశ్రీ బుధవారం కాలేజీలో అభినందించారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మహారాష్ట్ర బెల్‌గావ్‌లో ఈనెల 11 నుంచి 21 వరకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొన్న దివ్యశ్రీ మంచి ప్రతిభను కనబరిచింది. శిక్షణ అనంతరం కాలేజీకి వచ్చిన దివ్యశ్రీను ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ కేస్లిన్, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయా దేవి అభినందించారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం

సాయం అందజేస్తున్న సర్పంచ్, ఉపసర్పంచ్

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెం గ్రామంలో మూడు రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన బంటుపల్లి కళావతి బాధిత కుటుంబాన్ని ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి బుధవారం పరామర్శించారు. బాధితురాలికు 50 కేజీల బియ్యం, నిత్యావసరాలు, రూ.రెండు వేలు నగదు సాయం అందించారు. బాధితురాలికి అన్నివిధాలా అండగా ఉంటాయని భరోసానిచ్చారు. బాధితురాలికి ఉపసర్పంచ్ బంటుపల్లి రవణమ్మ 25 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మండల యూత్ ప్రెసిడెంట్ చందక అప్పలస్వామి, పంచాయతీ కన్వీనర్ షిణగం రామారావు వార్డు సభ్యులు వై.రామారావు, వై అప్పలనాయుడు, కె.పైడినాయుడు, బి.సన్యాసినాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు పిఎం సూర్యఘర్ యోజనపై అవగాహన

ప్రజాశక్తి- ఆనందపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు పిఎం సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎఇఇ సురేష్‌కుమార్ తెలిపారు.కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సంబంధిత ఇతర అధికారులు పాల్గొంటారన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, వినియోగదారులు పాల్గొనివిజయవంతం చేయాలన్నారు

కైలాసగిరిపై అడ్వెంచర్ స్పోర్ట్స్

పారంభిస్తున్న ఎమ్మెల్యే, విఎంఆర్‌డిఎ చైర్మన్

ప్రజాశక్తి - ఆరిలోవ : కైలాసగిరిపై విఎంఅర్‌డిఎ ఆధ్వర్యంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నెలకొల్పిన అడ్వెంచర్ స్పోర్ట్స్ బుధవారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. పర్యాటకులను ఆకర్షించే విధంగా విఎంఆర్‌డిఎ, శ్రీసాయి మోక్ష షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ ఆదాయ పంపిణీ విధానంలో నెలకొల్పిన జిప్ లైనర్, స్కైసైక్లింగ్ వంటి అడ్వెంచర్ స్పోర్ట్స్‌ను విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, కమిషనర్ కెఎస్ విశ్వనాథన్ ప్రాంభించారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న గ్లాస్ బ్రిడ్జిని వచ్చే ఏప్రిల్ నాటికి పూర్తిచేసి, పర్యాటకులకు అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు.

ఉల్లాసంగా బాలల రంగోత్సవం

పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి బాల రంగోత్సవం పోటీలు ఆద్యంతం ఉల్లాసంగా సాగాయి. కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి కుమారి ప్రారంభించిన కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థుల కోలాటం, థింసా, ఫోక్ డ్యాన్స్ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జివిఎంసి మూడో వార్డు ప్రాథమిక పాఠశాల విద్యార్థినుల థింసా నృత్యం పోటీల్లో విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీలకు డైట్ అధ్యాపకులు జె.మాధవి, ఆర్.నీలిమ, ఎం.మహాలక్ష్మి, ఎస్ త్రినాథరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.వైస్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, అధ్యాపకులు జి.నాగేశ్వరరావు, పి.హరిణి పాల్గొన్నారు

విపత్తుల నిర్వహణపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రకృతి విపత్తులు, మానవ తప్పిదాల వల్ల కలిగే ప్రమాదాల నుంచి రక్షణపై స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్‌డిఆర్ఎఫ్ బృందం అవగాహన కల్పించింది. బుధవారం ఎపి రాష్ట్ర విపత్తుల ప్రతిస్పందన దళం, విశాఖ ఒకటవ బెటాలియన్ డిఎస్‌పి వి.నారాయణరావు, ఎస్ఐ వైకుంఠావు, సిబ్బంది అధ్వర్యంలో తుపాన్‌లు, వరదలు, సునామీలు, భూకంపాలు, అగ్ని, నీటి ప్రమాదాలు జరిగే సమయంలో స్వీయరక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాఠశాల హెచ్ఎం పి.రమణ, విశ్రాంత హెచ్ఎం కనకల. సన్యాసినాయుడు పాల్గొన్నారు.

జివిఎంసి నాలుగో వార్డు మంగమారిపేట సామాజిక భవనంలో మత్స్యకారులకు విపత్తుల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌డిఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

నిరసన ప్రదర్శన, మానవహారం, ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

గత వైసిపి ప్రభుత్వ కాలంలో ఐదేళ్లపాటు ప్రజలకు సేవలు చేసిన వార్డు, గ్రామ వాలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఏపీ గ్రామ వార్డు వాలంటీర్ల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం అనకాపల్లి సిఐటియు ఆఫీస్ నుంచి నెహ్రూ చౌక్ కూడలి వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి, అక్కడ మానవహారం చేపట్టారు. అనంతరం గాజువాక వెళ్లే బస్టాప్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.దీప్తి, సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు వాలంటీర్లను విధుల్లోకి చేర్చుకోవాలని, రూ.10వేలు గౌరవ వేతనం ఇవ్వాలని, పెండింగ్ ఉన్న నాలుగు నెలల జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది ఉద్యోగులను ఒకేసారి తొలగించడం అనేది దేశంలోనే ఎక్కడా జరగలేదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం విలయ తాండవం చేస్తున్న నేపథ్యంలోనే రూ.5000కే ప్రభుత్వ కార్యకలాపాలను ప్రజలకు చేర్చే విధంగా వాలంటీర్లు సేవ చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక ఉద్యోగం ఇవ్వకపోగా 2,65,000 మంది వాలంటీర్లను, ఇసుక డిపోలు, ప్రభుత్వం మద్యం షాపుల్లో పనిచేస్తున్న వేలాది మందిని ఉద్యోగాల నుంచి తొలగించిందని విమర్శించారు. ప్రజలు అధికారం ఇచ్చింది ఉద్యోగాలు ఇవ్వడానికా? తీసేయడానికా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు కిరణ్, పీర్ సాహెబ్, విజయ్ కుమార్, సంధ్య, అయోధ్య, గీత, ప్రసాద్, దేముడు, శ్యామల, శ్రీను, అధిక సంఖ్యలో వాలంటీర్లు పాల్గొన్నారు.

అనకాపల్లి నెహ్రూచౌక్ జంక్షన్‌లోని బస్టాప్ వద్ద ధర్నా చేస్తున్న వాలంటీర్లు

గేదెల సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

మేలు రకం ఆవులతో అధిక లాభాలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : అధిక పాలను ఇచ్చే మేలు రకమైన ఆవులను కొనుగోలు చేయడం అధిక లాభాలను రైతులు పొందవచ్చునని విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ అన్నారు. బుచ్చయ్యపేటలో నూతనంగా నిర్మించిన విశాఖ డెయిరీ అదనపు భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ కృషి చేస్తుందన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన రైతులకు విశాఖ డెయిరీ మంజూరు చేసిన పరిహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను సిబ్బంది, రైతులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంకర లక్ష్మి, మాజీ సర్పంచ్ దొంకన అప్పలనాయుడు, సంఘ అధ్యక్షులు సుంకర బాబ్జి, ముమ్మన సూర్యనారాయణ, వేతన కార్యదర్శి పాచిల మణి, ముచ్చకర్ల తాతీలు, వెయ్యకు అప్పారావు పాల్గొన్నారు.

బర్నికాన కుటుంబానికి మాజీ మంత్రి గుడివాడ పరామర్శ

ప్రజాశక్తి-సబ్బవరం : అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు, టిడిపి వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి బర్నికాన సాయినాథరావు చిన్న కుమారుడు గత గురువారం మృతి చెందిన నేపథ్యంలో మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ బుధవారం సాయినాథరావు ఇంటికి వచ్చి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జాతీయ యాదవ సంఘం ఉపాధ్యక్షులు బర్నికాన రామారావు, వైసిపి నాయకులు మందపాటి జనకిరామరాజు, దంతులూరి దిలీప్ కుమార్, మోపాడ అప్పారావు, వనం అచ్చిం నాయుడు, కర్రి అప్పారావు, బలిరెడ్డి కనకరాజు, దాసరి ఈశ్వరరావు, దాడి సత్తిబాబు, ధూళి నరేష్ పాల్గొన్నారు.

దృఢ సంకల్పంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ప్రజాశక్తి-చోడవరం : దృఢ సంకల్పంతో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జె.రమణాజీ పిలుపునిచ్చారు. బుధవారం కళాశాల ప్రాంగణంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు మానసిక వికాసానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమాజంలో జరుగుతున్న మార్పులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. అనంతరం విద్యార్థి విద్యార్థినీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ కృష్ణకుమారి, డీన్ వెంకట వాసు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై ఆశాలు అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఆశా కార్యకర్తలు అన్ని రకాల వ్యాధులు పట్ల అవగాహన కలిగి ఉండాలని తురకలపూడి పిహెచ్సి వైద్యాధికారిణి సంధ్యారాణి అన్నారు. తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. షుగర్ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కలిగి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామలక్ష్మి, సునీల్ కుమార్, నాయుడు, రాజబాబు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని కొత్తూరు జంక్షన్ వద్ద రోడ్డు మరమ్మతు పనులను అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ బుధవారం పరిశీలించారు. అనంతరం పక్కనే ఉన్న చెరువును సందర్శించి చెరువు చుట్టు పక్కల అభివృద్ధి పనుల కొరకు అక్కడి నాయకులతో చర్చలు జరిపారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

గవరపాలెం శ్రీపేటా వారి గౌరీ పరమేశ్వరులు ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హాజరయ్యారు. మండలంలోని తుమ్మపాల గ్రామం కొత్తపేట వీధిలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవస్థానం నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ కొణతాలను సత్కరించింది. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు ఆధ్వర్యంలో బుధవారం 'ఎబ్యూస్ ఆఫ్ సోషల్ మీడియా అండ్ సైబర్ బుల్లియింగ్ ఇంపాక్ట్ ఆన్ స్టూడెంట్స్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అనకాపల్లి డిఎస్పి ఎం.శ్రావణి, న్యాయవాది యస్.శ్రీనివాస్, సైకాలజిస్ట్ దాడి సంజన పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాల వలన వచ్చే అనర్ధాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రావణి మాట్లాడుతూ సైబర్ నేరాలలో ఎక్కువగా యువత బలి అవుతుందని, తద్వారా వారి జీవితాలు నేరమయం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాది శ్రీనివాసరావు మాట్లాడుతూ సైబర్ నేరానికి పాల్పడిన వారికి సంవత్సర కాలం జైలు, రూ.10 లక్షలు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. సైకాలజిస్ట్ సంజన మాట్లాడుతూ సోషల్ మీడియాను అనవసరంగా యువత ఉపయోగిస్తుందని, దానిని ఏ విధంగా తగ్గించుకోవచ్చో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్ కుమార్, కళాశాల సూపరింటెండెంట్ పి.అనురాధ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు ఏ.సూరిబాబు. బిఎంవిపి.నాయుడు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

డివిఎన్ కళాశాలలో సినిమా బృందం సందడి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ నిర్మాణ సంస్థ అల్లు ప్రొడక్షన్స్ బ్యానర్‌లో సినీ దర్శకులు కిరణ్ వారియర్, నిర్మాత అల్లు శ్రీరాములు నిర్మించిన మెగాస్టార్ ఫ్యాన్ సినిమా ప్రమోషన్‌లో భాగంగా అనకాపల్లి దాడి వీరునాయుడు కళాశాలలో బుధవారం సినిమా బృందం సందడి చేసింది. డైరెక్టర్ కిరణ్ వారియర్ మాట్లాడుతూ మెగాస్టార్ అభిమానులు గర్వించేలా ఈ సినిమా తీయడం జరిగిందని ప్రేక్షకులు దీనిని విశేషంగా ఆదరించాలని కోరారు. నిర్మాత అల్లు శ్రీరాములు మాట్లాడుతూ ఈ సినిమా ఈనెల 29వ తేదీన అనకాపల్లి రాజా థియేటర్‌లో విడుదలవుతుందని చెప్పారు. జబర్దస్త్ నటుడు గడ్డం నవీన్, హీరోయిన్ సోనీ రెడ్డి, క్రేజీ గణేష్ విద్యార్థులతో సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఔషధ విజ్ఞాన సదస్సులను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక రాహుల్ గాంధీ కళ్యాణ మండపంలో ఈనెల 28, 29 తేదీలలో జరుగు రాష్ట్రస్థాయి ఔషధ విజ్ఞాన సదస్సులను విజయవంతం చేయాలని స్థానిక ఆయుర్వేద వైద్యులు అలుగోలు ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల నుండి సుమారు 250 మంది వైద్యులు, అనకాపల్లి ఆయుష్ డాక్టర్ కె.లావణ్య, కోడూరు ఆశ్రమ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ సుందర్ రాజ్ పెరుమాళ్ళు పాల్గొంటారని తెలిపారు.

ఆయుర్వేదంతో మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆయుర్వేదంతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని ఎన్టీఆర్ ఆసుపత్రి ఆయుర్వేద వైద్యురాలు కె. లావణ్య పేర్కొన్నారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశ్ కా ప్రకృతి పరిరక్షణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యాన్ని ప్రతి ఇంటికి చేరవేయాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. గత రెండు దశాబ్దాలుగా కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ చేపట్టిన పరిశోధనల ఆధారంగా పిత్త కఫ దోషాలపై మెరుగైన వైద్యం, వ్యాధి నివారణ, జీవన శైలి, ఆహారపు అలవాట్లు, వ్యాయామ దినచర్యలను ప్రచారం చేస్తామన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎఎస్‌పి మోహన్‌రావు, ఇతర అధికారులు

లింగ వివక్ష చూపకుండా పిల్లలను పెంచాలి

కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

పిల్లలను లింగవివక్ష చూపకుండా పెంచాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ సూచించారు. స్థానిక ఎస్ఆర్ శంకరన్ మీటింగు హాల్లో బుధవారం నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంపై జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టరు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో కిశోరి వికాసం కార్యక్రమ ఉద్దేశాన్ని, బాలబాలికలు హక్కులను తెలుసుకొని గ్రామస్థాయికి తీసుకువెళ్లాలన్నారు. బాలబాలికలకు వివక్ష చూపకుండా చదువు చెప్పించాలని, బాల్యవివాహాలు జరపకూడదని పేర్కొన్నారు. బాల్యవివాహాలు జరిపేవారిని ముందుగానే గుర్తించి నివారించాలని, బాల్యవివాహాలు ప్రోత్సహించేవారిని కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. బాలికలకు చదువుతోపాటు, ఆర్థికంగా స్థిరపడిన తరువాతే వివాహం జరిపించాలన్నారు. బాలికలకు పౌష్టికాహారం అందించాలని, వారికి వ్యాయామం, ఆటలు, శారీరక ఫిట్నెస్, యుక్త వయసులో ఎదురయ్యే శారీరక మార్పుల గురించి అవగాహన కల్పించాలని కోరారు. పనిప్రదేశాలలో స్త్రీలపై వేధింపులు చేసినా, బాడీ షేమింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలపై ఎక్కడైనా వేధింపులు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు ఎస్పి ఎల్.మోహనరావు మాట్లాడుతూ స్కూళ్లలో మౌళిక సదుపాయాలులేక, ఇతర సమస్యలతో ఆడపిల్లలు బడి మానివేస్తున్నారని, దానివలన బాల్యవివాహాలు జరిగే అవకాశం ఉంటున్నదని తెలిపారు. ఉపాధ్యాయినులు విద్యార్థినుల సమస్యలు తెలుసుకొని వారికి ధైర్యాన్ని అందించాలని, చదువులు కొనసాగేవిధంగా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఎ ఎస్. మంజులావాణి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు కె.అనంతలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎమ్. రమేష్, డాక్టర్ క్రాంతి, అడ్వకేట్ కుసుమ, దిశ ఎస్ఐ రాములమ్మ, యోగ రిసోర్స్ పర్సన్, డాక్టర్ శ్రీనివాసరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, సెర్ప్, మెప్మా ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, ఇంటర్మీడియట్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఇఒలు, కాంప్లెక్స్ హెచ్ఎంలతో సమీక్ష

ప్రజాశక్తి-అనకాపల్లి : మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు బుధవారం సమీక్ష నిర్వహించారు. అనకాపల్లి గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధార్ వెరిఫికేషన్, ఆధార్ కార్డుల్లో మార్పులు చేసుకునేందుకు తగిన ఏర్పాట్లు వేగవంతం చేయాలన్నారు. ఆధార్ వెరిఫికేషన్ పూర్తి అయి, ఏ రకమైన సాంకేతిక సమస్యలు లేని పిల్లలకు ఆపార్ జనరేట్ చేయాలన్నారు. యుడైస్ ప్లస్ 2024-25లో ప్రొఫైల్, స్టూడెంట్స్ మాడ్యూల్స్ పూర్తి చేయాలన్నారు. డిసెంబర్ 7న జరగబోయే మెగా పిటిఎమ్‌ని దృష్టిలో ఉంచుకుని అత్యంత త్వరితగతిన ఎఫ్ఎ -1, 2 మార్కుల సబ్మిషన్ పూర్తి చేయాలన్నారు. ఈ మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 5 పాఠశాలలను పాఠశాల విద్యాశాఖ నేరుగా ఎంపిక చేశామని, ఈ పాఠశాలలకు పార్లమెంటు, అసెంబ్లీ సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజన పథకం బిల్లులు సకాలంలో అప్లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఏపిఒ, ఎస్ఓ, సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ అప్పారావు నాయుడు

రాగూర్ ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకరరావు, కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

పరవాడ ఫార్మా సిటీలోని రాగూర్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ శంకర్రావు, జి కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాగూర్ ఫార్మా కంపెనీలో విషవాయువులు లీకైన ఘటనలో 8 మంది కార్మికులు అస్వస్థకు గురికాగా, ఒక కార్మికుడు మృతి చెందాదని తెలిపారు. మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, అస్వస్థకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలను యాజమాన్యాలు గాలికి వదిలేస్తున్నాయని, భద్రతా ప్రమాణాలు పాటించకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. దీంతో కార్మికులకు పని ప్రదేశాల్లో భద్రత లేకుండా పోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యాల పట్ల ఉదాసీనంగా వుండడం వల్లే తరుచూ ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రమాదాల సమయంలో కమిటీలు వేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప ఆ కమిటీల నివేదికలను బహిర్గతం చేసి ప్రమాదాలకు కారణమైన కంపెనీ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం లేదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ప్రమాదాలకు కారణమైన కంపెనీపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మృతుని కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి

రాగూర్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్రమైన విచారణ చేపట్టి, యాజమాన్యం కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుని కుటుంబానికి కోటి రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫార్మాసిటీలో తరచూ జరుగుతున్న ప్రమాదాలకు యాజమాన్యాల నిర్లక్ష్యమే కారణమన్నారు. క్షతగాత్రులు 9 మంది కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

రాగూర్ ఫార్మా ప్రమాదంపై ఎంపీ రమేష్ విచారం

అనకాపల్లి : పరవాడ రాగూర్ ఫార్మా కంపెనీలో విషవాయువు లీక్ అయిన ఘటనపై యాజమాన్యం మీద అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశంలో ఉన్న తరుణంలో ఘటన గురించి తెలిసిందని, వెంటనే జిల్లా అధికారులకు ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. రాగూర్ ఫార్మా కంపెనీలో ప్రమాదానికి కారణమైన వారిపై, యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిపై పూర్తి దర్యాప్తు నిర్వహించిన అనంతరం ప్రమాద కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మృతి చెందిన వ్యక్తికి, అస్వస్తతకు గురైన బాధితులకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని తెలిపారు.

క్షతగాత్రులకు గండి బాబ్జి పరామర్శ

పరవాడ : పరవాడ ఫార్మాసిటీలోని రాగూర్ ఫార్మాలో జరిగిన ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను బుధవారం టిడిపి పెందుర్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ పరామర్శించారు. క్షతగాత్రులు తొందరగా కోలుకోవాలని కోరారు.

రైవాడ జలాశయం పటిష్టతకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : బలహీనపడుతున్న రైవాడ జలాశయాన్ని పటిష్టపరిచేందుకు డ్రిప్ స్కీమ్ ద్వారా రూ.336 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. రైవాడ జలాశయాన్ని సందర్శించడానికి వచ్చిన సిడబ్ల్యుసి బృంద సభ్యులు, ఇరిగేషన్ అధికారులతో బుధవారం ఆయన రైవాడ అతిథి గృహంలో సమీక్ష జరిపారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పోలవరం నీరు రాగానే విశాఖపట్నంకు రైవాడ నీరు నిలుపుదల చేసి రైతులకు సాగునీటికి అందిస్తామని తెలిపారు.

రిజర్వాయర్‌ను పరిశీలించిన బృందం

అనంతరం సిడబ్ల్యుసి బృంద సభ్యులు రైవాడ రెగ్యులేటింగ్ గేట్లు, కుడి, ఎడమ కాలువల పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 10 రెగ్యులేటర్ గేట్లు ఉండగా వాటిని 11 గేట్లుగా మార్చనున్నారు. ప్రస్తుతం జలాశయ గేట్లు సామర్థ్యం 67 వేల క్యూసెక్కులు కాగా, భవిష్యత్తులో 1 లక్ష 67 వేల క్యూసెక్కుల వరద నీరు బయటకు విడుదల విధంగా పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి మెకానికల్ ఎక్సపర్ట్ అఖిలేష్ (హర్యానా), సివిల్ ఎక్సపర్ట్ హనీ (ఈజీప్ట్), ఈఈ ఏ. త్రినాథరావు, ఎస్ఈ ఎస్. సుగుణాకరరావు, డిఈఆర్ సత్యం నాయుడు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టిడిపి నాయకులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, కిలపర్తి భాస్కరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలో రావాడ గ్రామ పంచాయితీలో టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వం నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మరిసా అప్పల రాజు, సాలాపు వెంకట రమణ, కోన కృష్ణ, మోటూరు అప్పారావు, మరిసా బుల్లబ్బాయి, కావలి సన్యాసి రావు, ద్వారపూడి సంతోష్, అనకాపల్లి గోవింద్, కొత్తూరు కృష్ణ, గంగిరెడ్ల ధర్మరాజు, మరిస సత్యన్నారాయణ, గణపర్తి నాగ్గురాజు, చెల్వాకులు రాజు, చెల్వాకులు శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

బొగ్గు, ఎన్‌టిపిసి లారీలకు రోడ్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పరవాడ : ఎన్‌టిపిసి ఫ్లయాస్ లారీలను, బొగ్గు లారీలను లంకెలపాలెం జంక్షన్ గుండా కాకుండా వేరే మార్గాలు ద్వారా ప్రయాణించే విధంగా కొత్త రోడ్డు ఏర్పాటు చేయాలని బుధవారం ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు స్థానిక నాయకులు వినతిపత్రం సమర్పించారు. లంకెలపాలెం కూడలిలో రద్దీని దృష్టిలో పెట్టుకొని స్థానిక హోమి బాబా క్యాన్సర్ ఆసుపత్రి వద్ద నుండి ఎన్టిపిసి వైపు పోవు మార్గం వెంబడి ఏలేరు కాలువకు కొత్త రోడ్డు నిర్మించి, పరవాడ ఆర్ అండ్ బి రోడ్డుకు అనుసంధానం చేయాలని కోరారు. కార్యక్రమంలో బొండా అప్పారావు మాస్టారు, మడక రమేష్ నాయుడు, అమర పిన్ని జోగినాయుడు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

29న భీమలింగేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్ట, పి.భీమవరం మార్గమధ్యలో ఉన్న భీమలింగేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఈనెల 29న శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ తమరాన దాసు, ఉత్సవ కమిటీ సభ్యులు కాళ్ళ కోటేశ్వరరావు, పి.రామానాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం అయ్యప్ప, భవాని, శివ భక్తులకు, ఇతర భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మహా రుద్రాభిషేకం చేసుకుని భక్తులు ఆలయం వద్ద ముందుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి-యలమంచిలి : రానున్న మూడురోజుల్లో తుపాను కారణంగా ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడే ఆవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో రైతులు వరి పంట కోతను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పాలిమేర మోహనరావు సూచించారు. మండలంలోని తురంగలపాలెం, జంపపాలెం గ్రామాల్లో బుధవారం మండల పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కోసిన వరి చేలు కుప్పలు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు అరుణ, అభ్యుదయ రైతులు నాయుడు, కనకారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

2న విశాఖ డెయిరీ ముట్టడిని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాల ధరను పునరుద్ధరించాలని, పాల ఉత్పత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిసెంబర్ 2న జరిగే డెయిరీ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం జరిగిన అనకాపల్లి జిల్లా పాల రైతుల సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు ఏడాదికి రెండుసార్లు బోనస్‌లు చెల్లించాలని, విశాఖ డెయిరీలో జరుగుతున్న అవినీతి అరికట్టాలని, దీనిపై సిబిఐ చేత విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పాల ఉత్పత్తిదారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కర్రి అప్పారావు, పాల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గాడి భూలోక నాయుడు, గొర్రెలు, మేకల సంఘం జిల్లా నాయకులు దేవుడు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎర్ర దేవుడు

కె.కోటపాడు : తగ్గించిన ఆవుపాల ధరను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 2న పాడి రైతులు విశాఖ డెయిరీ యాజమాన్యాన్ని నిలదీయడానికి కదలి రావాలని ప్రజా సంఘాల మండల కన్వీనర్ యర్ర దేవుడు పిలుపునిచ్చారు. మండలంలోని పలు పాల సేకరణ కేంద్రాల్లో పాడి రైతులతో బుధవారం ఆయన మాట్లాడారు. విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవుపాల సేకరణ ధరలు లీటర్‌కు రూ.3 నుండి రూ.4 వరకు తగ్గించిందని, దీనివలన ఒక రోజుకు పాడి రైతులు రూ.20 లక్షల నష్టపోతున్నారని తెలిపారు. రైతుకు పాల ధర గిట్టుబాటు కావడం లేదన్నారు. గడ్డి, దాణా, పశు వైద్యం, కృత్రిమ గర్భాధారణ అన్నింటికి ధరలు పెరిగిపోయాయని, ఆ నిష్పత్తిలో పాలధరను పెంచాలన్న రైతుల డిమాండ్‌ను యాజమాన్యం పట్టించుకోకుండా ఇంకా ధర తగ్గించడం అన్యాయమన్నారు.

రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ

రైతులకు విత్తనాలు అందిస్తున్న టిడిపి నేత గండి బాబ్జి

ప్రజాశక్తి-సబ్బవరం

నూనె గింజలు, చిరు ధాన్యాల విత్తనాలు రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు ఎపి కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి అన్నారు. మండలంలోని మొగలిపురం గ్రామంలో రబీ సీజన్‌కి సంబంధించి రైతులకు సబ్సిడీపై వేరుశనగ, మినుములు, పెసలు, రాగులు విత్తనాలు, పొటాషియం, ట్రైకోడెర్మా విరిడి, జీవ శిలీంద్ర నాశిని తదితర మందులు గండి బాబ్జి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తమరాన బంగారు నాయుడు, అంగటి నానాజీ, గండి నరేష్, శ్రీరాములు, సత్యం, అయినింటి రాజు, బయలపూడి రాంబాబు, పోతునాయుడు, కోటాన దేవుడు, వెన్నెల శంకర్, రైతులు, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ రమాదేవి పాల్గొన్నారు.

దేవరాపల్లి : ప్రభుత్వం సరఫరా చేసిన వేరుశనగ విత్తనాలను స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఎంపిపి చింతల బుల్లి లక్ష్మి ఆధ్వర్యాన బుధవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా లాభసాటి పంటలు వేసుకుంటే మంచి ఫలితాలు పొందుతారన్నారు. రెండేళ్లలో పోలవరం పూర్తవుతుందని, తరువాత రైవాడ నీటిని పూర్తిస్థాయిలో రైతులకు చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఎల్వ్ కాంతమ్మ, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కర్‌రావు, సర్పంచులు సబ్బవరపు పెంటమ్మ, ఆదిరెడ్డి వరలక్ష్మి, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ సిహెచ్ సూర్యనారాయణ, తహశీల్దారు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

రూ.2 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని వాలాబు గిరిజన పంచాయతీ పరిధి నగరంపాలెంలో బుధవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో తామర్ల కొండబాబు పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.2 లక్షలు ఆస్తి నష్టం సంభవించింది. ఈ ప్రమాదంలో బాధిత కుటుంబం సర్వం కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డున పడింది. బుధవారం ఉదయం కొండబాబు ఇంటి నుంచి కూలి పనికి వెళ్లిన తర్వాత తన భార్య దేవుడమ్మ ఇంటి వద్దనే ఇంట్లో పని చేస్తుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో ఒక్కసారిగా పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు చూసి మంటలు అదుపు చేయటానికి ప్రయత్నించారు. అయినా ఇంటిలో ఉన్న బట్టలు, రూ.5000 నగదు, మినుములు, వంట సామాగ్రి, గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. సమాచారం తెలుసుకున్న సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి, బుజ్జి సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారాన్ని త్వరగా వచ్చేటట్లు చూస్తామని తెలిపారు. వీఆర్వో ఎం.ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి గోపీనాథ్, సంఘటన స్థలానికి చేరుకొని ఆస్తి నష్టాన్ని అంచనా వేసి తహశీల్దారు లక్ష్మీదేవికి నివేదిక అందజేశారు.

వ్యవసాయ హబ్‌గా చోడవరం నియోజకవర్గం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం నియోజకవర్గాన్ని వ్యవసాయ హబ్‌గా మార్చడమే తన లక్ష్యమని చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మండలంలోని గంధవరం వద్ద ఏపీ సీడ్స్ కార్పొరేషన్ జిల్లా విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న విత్తన ఉత్పత్తి కేంద్రం పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చోడవరం పక్క నియోజకవర్గాలన్నీ పారిశ్రామికంగా అభివృద్ధి చెందాయని, చోడవరం నియోజకవర్గం వ్యవసాయ రంగంలో అభివృద్ధి చేయడానికి అన్ని అవకాశాలు ఉన్నాయని తెలిపారు. బుచ్చయ్యపేట మండలం కృషి విజ్ఞాన కేంద్రం వద్ద వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూమి ఖాళీ లేకుండా పంటలు పండిస్తే రైతులకు ఏడాదికి ఎకరాకు సుమారు రెండు లక్షల రూపాయలు ఆదాయం వస్తుందని చెప్పారు. భవిష్యత్తులో చోడవరం చక్కర కర్మాగారంలో మొక్కజొన్న పంటతో డిస్టలరీ తయారు చేసే అనుబంధ పరిశ్రమను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంసి నాగసాయి, టిడిపి మండల అధ్యక్షుడు గంగాధర్, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, పళ్ళ అర్జున, నానాజీ, మాజీ జెడ్పిటిసి వియ్యపు అప్పారావు, డొంకిన అప్పలనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాలలో భాగంగా నాలుగు రోజు బుధవారం మండలంలోని బయ్యవరం హైస్కూల్ విద్యార్థులకు పరీక్షల అట్టలు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఉగ్గిని రమణమూర్తి, సిదిరెడ్డి శ్రీను, బుదిరెడ్డి గంగయ్య, సిదిరెడ్డి వెంకటేశ్వరరావు, తిర్రి చిరంజీవి, బుదిరెడ్డి అప్పడు, నాయకులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధి

-ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు -సజావుగా మండల సమావేశం

ప్రజాశక్తి -రావికమతం:ప్రజా ప్రతినిధులు అందరం కలిసి చోడవరం నియోజకవర్గంలో అన్ని గ్రామాలను రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేసుకుందామని చోడవరం శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్ రాజు కోరారు. రావికమతం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మండల మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి పైల రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, చోడవరం ఉండి రోలుగుంట వరకు మెయిన్ రోడ్డు, విత్తన పరిశోధన కేంద్రం ప్రాజెక్టు అభివృద్ధి పనులను వేగవంతం చేయడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికి మంచి నీటి సదుపాయం, సిసి రోడ్లు, డ్రైన్లు తదితర అభివృద్ధి పైన దృష్టి సారించడం జరిగిందని తెలిపారు. కొత్తకోట ఎంపిటిసి పూడి దేవా గత సమావేశంలో చర్చించిన సమస్యలు ఎన్ని పరిష్కారం చేశారని అధికారులను నిలదీశారు. అపార్ కోసం విద్యార్థులను ఒత్తిడి చేయకుండా తగిన సమయం ఇవ్వాలని, అవి సవరణ చేయడానికి కనీసం 15నుంచి 20 రోజుల సమయం పడుతుందన్నారు.ఒకటి, రెండు రోజుల్లో సవరణ చేసి తెమ్మని విద్యార్థులపై ఒత్తిడి చేయడంతో తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారని కొత్తకోట ఎంపీటీసీ పూడి దేవా మండల విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మకమైన విద్య, నాణ్యమైన భోజనం అందలేదని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి ఎంఇఒ దృష్టికి తీసుకువెళ్లారు. హార్టికల్చర్ శాఖ ద్వారా ఏ పథకాలు అమలవుతున్నాయని గొంప ఎంపీటీసీ గంజి సూర్యనారాయణ నిలదీశారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి భగవంతరావు మాట్లాడుతూ, నూతనంగా మరుగుదొడ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. తోటకూర పాలెం నాలుగు కిలోమీటర్ల రోడ్డును గత ప్రభుత్వంలో శంకుస్థాపన చేసినా ఇప్పటి వరకు ఎందుకు ప్రారంభించలేదని ఎంపీపీ పైల రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్ క్యాన్సిల్ కావడంతో రోడ్డు ప్రారంభించలేకపోయామని, తిరిగి టెండర్ పిలిచి ప్రారంభిస్తామని సబంధిత అధికారి సమాధానం ఇచ్చారు. నర్సీపట్నం నుండి రావికమతం, కింతలి, ఫూట్ రోడ్డు మీదుగా మాడుగులకు బస్సు పునరుద్ధరించాలని కవగుంట సర్పంచ్ దాసరి కుమారి, గుమ్మాలపాడు సర్పంచ్ సన్యాసినాయుడు కోరారు. కొమిర సచివాలయం పరిధిలో కవగుంట, కెబిపి అగ్రహారం, కొమిర పంచాయతీలు ఉన్నాయని ఆ సచివాలయానికి డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో సేవలు నిలిచిపోయాయని కవగుంట సర్పంచ్ తెలిపారు. కొత్తకోట గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని కొత్తకోట ఎంపిటిసి పూడి దేవా తెలపగా స్పందించిన శాసనసభ్యులు ఆక్రమణ తొలగించి పంచాయతీ ఆధ్వర్యంలో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దాంట్ల రమణ, భవాని ప్రసాదు, తహసిల్దారు బి.వెంకటరమణ, ఎంపీడీవో బానోజీ రావు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

29న నక్కపల్లిలో ప్రజా దర్బార్

-హాజరు కానున్న హోంమంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి తహసిల్దార్ కార్యాలయం ఆవరణంలో ఈనె 29వ తేదీ శుక్రవారం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హోంమంత్రి అనిత హాజరు కానున్నారని, ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలకు చెందిన అధికార యంత్రాంగం ప్రజాదర్బార్‌లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెంకటేష్ కోరారు.

టీకాలు వేస్తున్న వైద్యాధికారి

పశువులకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని బి.సింగవరం గ్రామంలో జరుగుతున్న బ్రూసెల్లా వాక్సిన్ కార్యక్రమాన్ని ఖండివరం పశు వైద్యశాల వైద్యులు ఎస్‌సిహెచ్ గణేష్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాడి రైతులతో ఆయన మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాలలో ఈ బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలను డిసెంబర్ నెల 19వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. పాడి రైతులు తమ దగ్గరున్న 4 నుంచి 8 నెలల వయసు గల ఆడ పెయ్యలకు ఈ టీకాలు తప్పకుండా వేయించుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు మండలంలో 120 ఆడ పెయ్యలకు ఈ టీకాలు వేయడం జరిగిందని తెలిపారు. అనంతరం జైతవరం, అప్పలరాజుపురం రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైతవరం పశు సంవర్థక సహాయకుడు మోర్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

రైతులకు విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సీహెచ్.నాగాపురం గ్రామంలో బుధవారం రైతులకు సబ్సిడీపై మినుములు, పెసలు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే సబ్సిడి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొప్పన ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పంచకర్లకు సత్కారం

ప్రజాశక్తి -రావికమతం: .పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబును అనకాపల్లి జిల్లా తూర్పు కాపు సంక్షేమ సంఘం నేతలు బుధవారం ఘనంగా సన్మానించారు. పెందుర్తి శాసనసభ్యుల కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు రమేష్ బాబు మాట్లాడుతూ, జిల్లాలో తూర్పు కాపులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షులు బోండా అప్పారావు, అనకాపల్లి జిల్లా తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు కరణం శ్రీహరి, ముఖ్య సలహాదారు అడపా శేషగిరిరావు, జిల్లా ఉపాధ్యక్షులు బంగారు మెట్ల నానాజీ, కార్యనిర్వాహక కార్యదర్శి మడతూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రహదారి లేక అవస్థలు

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం బుచ్చంపేట శివారు గ్రామమైన గుర్రంపేటకు రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంట్ల పాలెం రోడ్డు నుండి బుచ్చింపేట వరకు మెటల్ రోడ్డు వెడల్పు లేకపోవడంతో రాళ్ళ పేకి తేలడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణంకు నిధులు మంజూరు చేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

రాళ్లు తేలిన రోడ్డు

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:వాతావరణ శాఖ ఫెంగల్ తూఫాన్ హెచ్చరిక నేపథ్యంలో రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సూచించారు. మండలంలోని ఉద్దండపురం, గొడిచెర్ల గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి పర్యటనలో వరి పొలాలను పరిశీలించారు. ఎవరైనా వరి కోతలు కోసిన్నట్లయితే వెంటనే వరి పనలను కుప్పలు గా వేసుకోవాలన్నారు. తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ ఓ సత్యనారాయణ, సాయికుమారి , ఆర్ ఎస్ కె సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎఒ

ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్

మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :మండలంలోని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సాంఘిక శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు డివిజె అప్పారావు, ఒమ్మి అప్పారావుల ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు సత్యారావు పర్యవేక్షణలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ ఆకట్టుకుంది. మాక్ పార్లమెంట్ లో పాల్గొన్న విద్యార్థులు రాజకీయ పరిభాష వాక్చాతుర్యంతో అబ్బురపరిచారు. ఎంపీలు, కేంద్ర మంత్రుల పాత్రధారణలో పలు అంశాలపై చర్చలు, సంభాషణలతో ఆలోచింపజేశారు.ప్రజా సమస్యలపై ఎంపీలు అడిగిన ప్రశ్నలకు సభాపతి ఆదేశాల మేరకు సంబంధిత మంత్రులు సమాధానం చెప్పారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యారావు మాట్లడుతూ చట్టసభలు, రాజకీయాల పట్ల అవగాహన, రాజ్యాంగం హక్కులు,విలువలు విశిష్టత విద్యార్థి దశ నుండి తెలియజేయలన్న లక్ష్యంతో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. గాంధీజీ, నెహ్రూ, భగత్ సింగ్,ఝాన్సీ లక్ష్మీభాయి ఇలా 23 మంది స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో విద్యార్థులు అలరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న వికలాంగుల పోరాట సమితి నేతలు

వివిఒను కొనసాగించాలి

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో కింతంపేట వెలుగు వివోఏను కొనసాగించాలని చోడవరం నియోజకవర్గ వికలాంగుల హక్కుల పోరాట సమితి కన్వీనర్ గంజి శ్రీనివాసు, మండల కార్యదర్శి ముసలి నాయుడు సత్తిబాబులు చోడవరం శాసనసభ్యులు కె ఎస్ ఎన్ ఎస్ రాజు దృష్టికి తీసుకువెళ్లారు. మండల కేంద్రంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి బుధవారం ముఖ్యఅతిథిగా హాజరైన శాసనసభ్యులను కలిసి కింతంపేట వెలుగు వివోఏ గౌరీ సమస్యను పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని తెలిపారు ఈ సందర్భంగా చోడవరం నియోజకవర్గం వికలాంగుల హక్కుల పోరాట సమితి కన్వీనర్ గంజి శ్రీనివాస్ మాట్లాడుతూ, గత కొన్ని ఏళ్ళ గా ఆ గ్రామ వివోఏగా పనిచేస్తుందన్నారు.ఆమె మహిళ వికలాంగురాలని, ఎటువంటి జీవనోపాధి లేదన్నారు. అటువంటి వ్యక్తిని అక్రమంగా తొలగించడం అన్యాయ మతన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘం సభ్యులు పలువురు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయానికి.. సరికొత్త హంగులు

ప్రజాశక్తి -కోటవురట్ల:సిబ్బంది మరియు పలువురు దాతల సహాయంతో తహశీల్దార్ కార్యాలయం కొత్త హంగులు హద్దుకుంటున్నాయి. ఇందులో భాగంగా కార్యాలయంలో పలు భాగాలలో దాతల సహకారంతో టైల్స్ నిర్మాణం చేపడుతున్నారు.తహసిల్దార్ తిరుమల బాబు ప్రత్యేక శ్రద్ధ చూపి ఆయన ఉండే గదిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకున్నారు. వాష్ రూమ్స్ సైతం పున్ణనిర్మాణంతో మరమ్మతులు చేపడుతున్నారు.

ఏర్పాటు చేస్తున్న టైల్స్

ఉత్కంఠ పోరులో ఛత్తీస్‌గఢ్ విజయం

-రైల్వేస్ జట్టుతో చివరి బంతి వరకు సాగిన హోరాహోరీ పోటీ

మూడు వికెట్లు తీసిన కరణ్‌శర్మ

ప్రజాశక్తి -మధురవాడ : సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 క్రికెట్ పోటీల్లో భాగంగా బుధవారం రైల్వేస్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో ఛత్తీస్‌గఢ్ జట్టు 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ నెగ్గిన ఛత్తీస్‌గఢ్ జట్టు, ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన రైల్వేస్ జట్టు ఓపెనర్లు, టాపార్డర్ తడబడింది. ఛత్తీస్‌గఢ్ బౌలర్లు రవికిరణ్, గగన్‌దీప్ సింగ్ ధాటికి కేవలం ఆరు పరులకే రెండు వికెట్లు కోల్పోయింది రైల్వేస్, తర్వాత అజయ్ మండల్, మయాంక్ యాదవ్ విజృంభణతో 39 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకలలోతుల్లో మునిగిపోయింది. ఈ దశలో ఉపేంద్ర యాదవ్, అషుతోష్ శర్మలు అర్ధ సెంచరీలు చేసి రైల్వేస్ జట్టును ఆదుకున్నారు. సమయోచితంగా ఆడుతూ..చూడచక్కని షాట్లతో ప్రేక్షకులను అలరించారు. మరో వికెట్ కోల్పోకుండా 120 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఉపేంద్ర యాదవ్ 47 బంతుల్లో 4 ఫోర్లు, నాలుగు సిక్సర్ల సహాయంతో 68 పరుగులు, అషుతోష్ శర్మ 37 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్ల సహాయంతో 59 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. దీంతో రైల్వేస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 159/5 పరుగులు చేసింది. ఛత్తీస్‌గఢ్ బౌలర్లలో గగన్‌దీప్ సింగ్ 2 వికెట్లు, రవికిరణ్, అజయ్‌మండల్, మయాంక్ యాదవ్ చెరో వికెట్ తీసుకున్నారు.

160 పరుగుల విజయలక్ష్యంతో బరిలో దిగిన ఛత్తీస్‌గఢ్ జట్టు 27 పరుగుల వద్ద ఓపెనర్ అమన్‌దీప్ సింగ్‌ను(7)ను కరణ్ శర్మ పెవిలియన్‌కు పంపాడు. ఈ దశలో మరో ఓపెనర్ ఆయుష్ పాండేకు శశాంక్ చంద్రకర్ తోడయ్యాడు. వీరిద్దరూ అవకాశం దొరికినప్పుడల్లా బంతిని బౌండరీ, సిక్సర్‌గా మలిచి జట్టు విజయానికి కృషి చేశారు. శశాంక్ 40 బంతుల్లో 5 ఫోర్లు, రెండు సిక్సర్ సహాయంతో 57 పరుగులు చేశారు. ఆయుష్ పాండే 30 (ఫోర్, రెండు సిక్సర్లు) పరుగులు చేశారు. చివరిలో గగన్‌దీప్ సింగ్ 11, శుభం అగర్వాల్ 6 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు ఒక బంతి మిగిలి ఉండగా, ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీలో. ఛత్తీస్‌గఢ్ జట్టు 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. రైల్వేస్ బౌలర్లలో కరణ్‌శర్మ 3, అషుతోష్ శర్మ 2, రాహుల్‌శర్మ వికెట్ తీసుకున్నారు.

అర్ధసెంచరీ సాధించిన ఉపేంద్రయాదవ్

గంజాయి నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి -కొత్తకోట: ఇటీవల గంజాయి స్వాధీనం చేసుకున్న కేసులో ఇప్పటివరకు పరారీలో వున్న వ్యక్తి ని అరెస్ట్ చేసి కోర్టుకి తరలించినట్లు కొత్తకోట సీఐ కోటేశ్వరరావు తెలిపారు. గత నెల 29న కొత్తకోట పోలీసులు గంజాయితో పాటు కారు స్వాధీనం చేసుకొని కేరళ కు చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసారు. వీరికి సరుకు అందించిన పెదబయలు మండలానికి చెందిన వ్యక్తి అప్పటినుంచి పరారీలో వున్నాడు. అప్పటినుంచి పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. కొత్తకోట పోలీసులు వ్యక్తిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి కోర్టుకి తరలించినట్లు సీఐ తెలిపారు...

నేడు రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలోని నర్సీపట్నం- అడ్డురోడ్డు రోడ్డు పనులకు ఈనెల 28న హెూం మంత్రి వంగలపూడి అనిత శంఖుస్థాపన చేయనున్నట్లు టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేఖరులకు ఇచ్చిన సమాచారం మేరకు కోటఉరట్ల మండలం రామచంద్రపురం నుండి యస్ రాయవరం మండలం అడ్డురోడ్డు వరకు సుమారు పది కిలోమీటర్లు మేర శిధిలావస్థలో ఉన్న రోడ్డును ఇరవై మూడున్నర కోట్ల రూపాయలతో పూర్తి స్థాయి రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు దార్లపూడి వద్ద హెూం మంత్రి అనిత శంఖుస్థాపన చేస్తారన్నారు. రోడ్డును అతి త్వరగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

అవగాహన కల్పిస్తున్న అరుంధతి

ఉపాధి అవకాశాలపై అవగాహన

ప్రజాశక్తి- మాడుగుల: జీవన నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలపై స్థానిక డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.వి.ఎస్.ఎస్. శాస్త్రి మాట్లాడుతూ, విద్యార్థులు తగిన నైపుణ్యం పెంచుకున్నప్పుడు మాత్రమే ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు.స్వచ్ఛంద సంస్థ శిక్షకురాలు అరుంధతి మాట్లాడుతూ, విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధికి ఉద్యోగ అవకాశాలు కలగడానికి జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జయలక్ష్మి, అధ్యాపకులు పులవర్తి పైడిరాజు, షర్మిలశ్రీ, రమణమూర్తి, రాజు, నారాయణ, అప్పలనాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం. రాంకుమార్, ప్రసాదరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి-పాడేరు : బాల్య వివాహాలను అందరూ వ్యతిరేకించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ సూచించారు. బాల్య వివాహాలు సామాజిక దురాచారమని పేర్కొన్నారు. బుధవారం స్థానిక కె.జి.బి.వి. పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్య వివాహాల అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికలను కాపాడానికి అనేక చట్టాలను ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. బాలికా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. గిరిజన సమాజం ఎదగాలంటే బాలికలు ఉన్నతగా చదువుకుని తలిదండ్రులకు ఆసరాగా నిలవాలన్నారు. బాల్య వివాహాలపై అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి మాట్లాడుతూ, బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం అభివృద్ధికి ఆటంకం కలిగిస్తాయన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని బాగా చదువుకోవాలన్నారు. డిఎస్పీ బి.వేణు గోపాల్ మాట్లాడుతూ, శారీరకంగా, మానసికంగా ఎదుగుదల వచ్చాక వివాహాలు చేసుకోవాలని సూచించారు.

ఎల్‌జి పాలిమర్స్‌పై ముఖ్యమంత్రికి ఎందుకంత ప్రేమ.?

-సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎల్‌జి పాలిమర్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎందుకంత ప్రేమ అని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ప్రశ్నించారు. తిరుపతి శ్రీ సిటీలో ఎల్‌జి పాలిమర్స్ సంస్థకు 188 ఎకరాలు ఎపిఐసిసి ద్వారా భూ సేకరణ చేసి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడంపై ఆయన స్పందించి ఒక ప్రకటన విడుదలచేశారు. విశాఖలో ఎల్‌జి పాలిమర్స్ సేరైన్ గ్యాస్ లీక్ అయి 15 మంది చనిపోయారని, ప్రభుత్వం ప్రకటించిన రూ.కోటి నష్టపరిహారం 12 మందికి చెల్లించి, ముగ్గురికి నేటికీ తెలిపారు. ఆ రోజు ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నిలబెట్టుకోలేదని పేర్కొన్నారు. ఎల్‌జి పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఏ విధమైన నష్టపరిహారమూ, జీతాలు, చెల్లించలేదని, ఆ ప్రాంతంలో నిర్మిస్తామన్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను నిర్మించలేదని, ప్రతినెలా ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తానని చెప్పిన హామీ కూడా నెరవేరలేదని తెలిపారు. ఎల్‌జి పాలిమర్స్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే ఆ ప్రమాదం జరిగిందని, కాలం చెల్లిన యంత్రాలను, ట్యాంకర్లు ఉపయోగించడం, భద్రతా చర్యలు చేపట్టకపోవడం దీనికి కారణమని నివేదికలో స్పష్టంగా పేర్కొన్నా యాజమాన్యాన్ని శిక్షించలేదని పేర్కొన్నారు. ఇప్పుడు కొత్తగా తిరుపతి శ్రీ సిటీలో భూమి ఇవ్వడంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ఆసక్తి ఏమిటో అర్థం కావడం లేదని విమర్శించారు. ఆ పరిశ్రమ ఏర్పాటుకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీ మినహాయింపు, 20 ఏళ్ల పాటు నీటి వినియోగానికి పూర్తిగా రాయితీలు, రాష్ట్ర జిఎస్‌టిని మినహాయించడం, 20 ఏళ్ల పాటు విద్యుత్ చార్జీల్లో 50 శాతం రాయితీ, ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులన్నీ వెను వెంటనే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడం అత్యంత దుర్మార్గం అని పేర్కొన్నారు. ఎల్‌జి పాలిమర్స్ పరిశ్రమకు శ్రీ సిటీలో ఇచ్చిన అనుమతులు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్‌జి యాజమాన్యాన్ని శిక్షించాలని, విశాఖలో ఉన్న ఎల్‌జి పాలిమర్స్ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు.

కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

కలవరపెడుతున్న వాతావరణం

ప్రజాశక్తి-కోటవురట్ల: అల్పపీడన ప్రభావంతో నెలకొన్న వాతావరణ పరిస్థితులు రైతులను కలవర పెడుతున్నాయి. మండల వ్యాప్తంగా దాదాపు అన్ని ప్రాంతాల్లోని పంట కోత దశకు వచ్చింది. తుపాను నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు 90శాతం పంట కోతకు సిద్ధంగా చేలల్లో ఉంది. 10శాతం మాత్రమే కోతలు జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. మరోవైపు గడిచిన నాలుగు రోజులుగా తగ్గిన వాతావరణంతో వీస్తున్న చలిగాలులతో కోత పూర్తయిన పంటలు ఆరకపోవడం తో ఇబ్బందులు పడుతున్నారు. ఏది ఏమైనా డిసెంబర్ నెలాఖరు వరకు వాతావరణం అనుకూలంగా ఉంటే రైతులు గొట్టెక్కుతారు.

అప్పన్న భూములపై సమాలోచన

ప్రజాశక్తి-విజయనగరం కోట : సింహాచలం దేవస్థానం పంచ గ్రామాల భూముల క్రమబద్ధీకరణ విషయమై సింహాచలం దేవస్థానం చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు సమక్షాన జిల్లాకు చెందిన రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు, విశాఖ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు టిడిపి కార్యాలయంలో చర్చించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, ఇతర ప్రజాప్రతినిధులకు అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు సాదర స్వాగతం పలికారు. అనంతరం అశోక్ గజపతిరాజు విశాఖ జిల్లా ఎమ్మెల్యేలతో మాట్లాడుతూ, ఈ భూములు భక్తులు దేవుడికి ఇచ్చిన ఆస్తులని, రక్షణ విషయంలో స్పష్టత వస్తే పరిష్కారం వస్తుందని అన్నారు. ఈ విషయం తన తండ్రి నాటి నుంచి రగులుతున్న సమస్యగాఉందని, స్పష్టత ఉండి ముందుకు వెళితే ఎంత జటిలమైన సమస్యకైనా పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ప్రజల ఆలోచన ఎలా ఉందో తెలుసుకోవాలన్నారు. చందనం తోటలు వేసి పెంచితే 30ఏళ్లలో చేతికందుతాయని తెలిపారు. దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం పల్లా శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడుతూ, దేవస్థానం భూముల సెటిల్మెంట్ నిమిత్తం చైర్మన్ అనుమతి కోసం వచ్చామని తెలిపారు. ఏదైతే 420 ఎకరాల భూమి ఉందో దానిపై ఇప్పటికే ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకొని శతాబ్దాలుగా ఉంటున్నారని తెలిపారు. దానికి సరి సమానంగా 620 ఎకరాల భూమితో పాటు రెగ్యులైజేషన్‌లో వచ్చిన డబ్బులు కూడా ఇస్తామని తెలిపారు. దీనికి చైర్మన్ అశోక్ గజపతిరాజు సానుకూలంగా స్పందించారని తెలిపారు. సమావేశంలో విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.రమేష్‌బాబు, ప్రభుత్వ విప్ గణబాబు, నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల పిల్లలకు నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి -పాడేరు: ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పనిని పూర్తి చేసిన కూలీల నిరుద్యోగులైన పిల్లలకు సీడాప్ అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఏ .పి.ఓ. వి.అభిషేక్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో సీడాప్ డిడియు జి.కె. పై ఉన్నత పోగ్రాం గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ఉపాధి హామీ కూలీల పిల్లలకు వివిధ నైపుణ్య రంగాలలో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన వసతితో కూడిన శిక్షణను అందిస్తారని చెప్పారు.అభ్యర్థులు 18 నుండి 35 ఏళ్ల వయస్సు కలిగి పదవ తరగతి ఆపై చదువులు చదివి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావు, డి.ఆర్.డి. ఏ పి.డి వి.మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు

ప్రజాశక్తి-అరకులోయ :అరకులోయ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఎయిడ్స్ డే సందర్భంగా కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.చలపతి మాట్లాడుతూ, ఎయిడ్స్ నిర్మూలనకు గ్రామాలలో యువతకు అవగాహన కల్పించాలని కోరారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ, పెయింటింగ్ పోటీలు విద్యార్థినులలో దాగివున్న నైపుణ్యం వెలికి తీయడంలో దోహదపడతాయని తెలిపారు.ఈ పోటీలలో అధ్యాపకులు కే.బాలరాజు, సిహెచ్ మురళికృష్ణ, ధర్మారావు, సుభన్, స్వర్ణలత పాల్గొన్నారు.